బోర్డులకే పరిమితం..

నిరుపయోగంగా మారుతున్న క్రీడా ప్రాంగణాలు

- పట్టించుకోని అధికారులు, పాలకులు

వెంకటాపురం(కె) : గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కాగా ప్రస్తుతం అవి బోర్డులకే పరిమితమై నిరుపయోగంగా మారాయి. గ్రామ పంచాయతీ సిబ్బంది వాటి నిర్వహణను పూర్తిగా మరిచిపోయారు. దీంతో క్రీడా ప్రాంగణాలు పేరుకు మాత్రమే పరిమితమయ్యాయి. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ఏ క్రీడా ప్రాంగణం సైతం ఉపయోగంలో లేదు. ఫలితంగా అవి పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి.

ప్రజాధనం వృథా..

అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వంతో క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా ఉండడంతో క్రీడాకారులకు ప్రయోజనం దక్కడం లేదు. దీంతో ప్రజాధనం వృథాగా మారుతోంది. గత ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రతి గ్రామ పంచాయతీలో రూ.2.5లక్షలు వెచ్చించి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కాగా అధికారులు క్రీడా ప్రాంగణాలకు బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు ఆటస్థలాలు లేక పొలాల్లో ఆడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలపై దృష్టి సారించి అందుబాటులోకి తీసుకు రావాలని గ్రామస్తులు, క్రీడాకారులు కోరుతున్నారు.



బీసీ మర్రిగూడెంలో బోర్డుకే పరిమితమైన క్రీడా ప్రాంగణం

అధికారులు దృష్టిసారించాలి



గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. దీంతో వాటిలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. క్రీడా ప్రాంగణంలో ఆటవస్తువులు సైతం లేకుండా పోయాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం దృష్టి సారించి క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తీసుకురావాలి

- తంగళ్లపల్లి ప్రసాద్

అందుబాటులోకి తేవాలి



గ్రామీణ ప్రాంతాల్లో సరైన క్రీడా స్థలాలు లేక ఆటలు ఆడేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పొలాల్లో, ఖాళీ స్థలాల్లో చిన్నారులు, యువకులు ఆటలు ఆడుకుంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో బోర్డులు పెట్టారే తప్ప ఆటలకు అనువుగా లేదు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తీసుకురావాలి.

- కట్ల నర్సింహాచారి

క్లుప్తంగా

అటవీ ప్రాంతంలో లిక్కర్ విక్రయించొద్దు

ఏటూరునాగారం: అటవీశాఖ కార్యాలయం, వన్యప్రాణి ప్రాంతం, దట్టమైన అడవికి దగ్గర ఉన్న ప్రాంతాల్లో మద్యం విక్రయాలు చేయరాదని, చెత్తాచెదారం పడయొద్దని రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో చుట్టు పక్కల ఉన్న నివాస ప్రజలకు శనివారం నోటీసులను జారీ చేశారు. వన్యప్రాణులు తిరిగే ప్రాంతాల్లో మద్యం, నిప్పు వంటివి నిషేధించినట్లు తెలిపారు. అలాగే అడవికి దగ్గర ఉన్న నివాస ప్రజలు వ్యర్థాలను చెట్ల వద్ద పడేయడం వల్ల చెట్ల మరణించడం, అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అందుకోసమని స్థానిక ప్రజలు నిబంధనలకు లోబడి జీవించాలన్నారు. ఎవరు కూడా చట్టాలను అతిక్రమించవద్దని ఆయన కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు



చిట్యాల : మండల కేంద్రంలోని హెల్త్ సబ్ సెంటర్‌కు వెళ్లే విద్యుత్ వైరు షార్ట్ సర్క్యూట్ కావడం వల్ల శనివారం నిప్పురవ్వలు ఎగిసిపడి మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన హెల్త్ సబ్ సెంటర్ సిబ్బంది పోలీసులకు, ఫైరింజన్‌కు, గ్రామ పంచాయతీ సిబ్బందికి సమాచారం అందించారు. ఎస్సై శ్రావణ్ కు మార్, ఒడితల పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక, జీపీ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామ పంచాయతీ నుంచి వాటర్ ట్యాంకర్‌ను తెప్పించి సబ్‌సెంటర్ వద్ద మంటలను ఆర్పివేశారు.ఎలాంటి నష్టం జరగలేదు. అనంతరం భూపాలపల్లి నుంచి ఫైరింజన్ సిబ్బంది, అధికారులు వచ్చి పూర్తిగా మంటలను ఆర్పివేశారు.

కాళేశ్వరం అడవిలో..



కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వర ముక్తివనం పార్కు ఎదుట నీలగిరి వనంలో మంటలు చెలరేగాయి. శనివారం సాయంత్రం అడవిలో కాళేశ్వరం దైవదర్శనానికి వచ్చిన భక్తులు వంటలు చేసుకొని నిప్పును వదిలేశారు. దీంతో మంటలు ఎగిసిపడ్డాయి. అటవీలో మంటలు చుట్టు పక్కల అర కిలోమీటర్ మేర వ్యాపించడంతో పొగతో నిండిపోయింది. దీంతో అడవిలోని మొక్కలు బూడిదయ్యాయి. నిప్పంటుకున్న విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేశారు. అడవిలో మంటలు వ్యాపిస్తుండడంతో వృక్షాలతో పాటు అటవీ జీవరాశులకు ప్రమాదం పొంచి ఉందని పలువురు వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు మాత్రం వేసవి చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఇసుక దందాను అరికట్టాలి

చిట్యాల : చిట్యాల, టేకుమట్ల మండలాల్లోని మానేరు వాగు నుంచి విచ్చలవిడిగా ఇసుక దందా కొనసాగుతున్న జిల్లా ఉన్నతాధికారులు కనీసం పట్టించుకోవడం లేదని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మానేరు వాగు నుంచి భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్న జిల్లా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. మానేరు వాగు నుంచి ఇసుకను తరలించడం వల్ల వాగులో నీరు ఉండడం లేదని, భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని ఆయన వెల్లడించారు.

అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపనకు ముస్తాబు

ఏటూరునాగారం : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప ఆలయంలో ఈనెల 16న అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గౌరీశంకర్ తెలిపారు. ఈనెల 13న విగ్రహాల ఊరేగింపు, 14న అంకురారోహణ గణపతి పూజతో అగ్నిప్రతిష్ఠ, 15న హోమం, శయ్యాదివాసము, ధాన్యాధివాసము, పలు పుష్ప ఆదివాసములతో పూజలు జరుగుతుందని వివరించారు. బుధవారం ఉదయం 11:8 నిమిషాలకు యంత్ర, విగ్రహ, ప్రాణ ప్రతిష్ఠ, దృష్టి కుంభం, బలిదానముతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే యాగశాలతో పాటు పడి పూజ కోసం 18 మెట్లు నిర్మించడం జరిగిందన్నారు. గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, శివ, విష్ణు, మాలికపుర రత్తమ్మతో పాటు ఇతర విగ్రహాలను కూడా ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. ఆరు మండలాలకు సంబంధించి అయ్యప్ప దేవాలయం ఏటూరునాగారంలో ఏర్పాటు కావడంతో భక్తులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిష్ఠాపనకు ఆయా గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో రానుండగా చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం, మహా అన్నదానం వసతులను ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. ప్రత్యేక కుంకుమ పూజ, కళాశాల పూజ, హోమం పూజ కార్యక్రమాలను చేపట్టనున్నారు.



ముస్తాబవుతున్న అయ్యప్ప ఆలయం

టెండర్ల ఆహ్వానం

మంగపేట : మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో వచ్చే నెలలో జరుగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు (జాతరలో) వివిధ ఏర్పాట్ల పనులకు అనుభవం, అర్హత కలిగిన వారి నుంచి సీల్డు కొటేషన్ టెండర్లను స్వీకరిస్తున్నట్లు ఆలయ ఈఓ సత్యనారాయణ శనివారం తెలిపారు. టెండర్లను ఈనెల 13 నుంచి 17 వరకు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దేవస్థానం కార్యాలయంలో రూ.500, ఏదైనా జాతీయ బ్యాంక్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి దేవస్థానం పేరిట సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.5,000 చెల్లించి కొటేషన్ షెడ్యూల్ పొందవచ్చన్నారు. పూర్తి వివరాలకు దేవస్థానం కార్యాలయంలో కాని లేదా 9963221704 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గుడుంబా స్థావరంపై దాడి

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలో పోలీసులు శనివారం గుడుంబా స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. ముదిరాజ్ కాలనీకి చెందిన గాడిచర్ల నారాయణ ఇంట్లో గుడుంబా తయారు చేస్తున్న బట్టి, 400 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామన్నారు. 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని నారాయణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల పరిశీలన

వాజేడు : మండల పరిధిలోని పూసూరు గ్రామ పంచాయతీలోని డబుల్ బెడ్రూం ఇళ్లను మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, ఆర్ఐ కుమారస్వామి శనివారం పరిశీలించారు. ఈ నెల 7న సాక్షి దినపత్రికలో 'లబ్ధిదారులకు ఇళ్లు అందేనా' అనే శీర్షికన వార్త ప్రచురితం కాగా స్పందించిన కలెక్టర్ డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలని స్థానిక అధికారులను ఆదేశించారు. పిల్లర్ లెవెల్ పూర్తి చేసినవి-18, స్లాబు, గోడలు పూర్తయిన ఇళ్లు-7, స్లాబు, గోడలు, ప్లాస్టింగ్ పూర్తయినవి-3, స్లాబ్ మాత్రమే వేసినవి-2 ఇళ్లు ఉన్నట్లు గుర్తించారు. అక్కడ ఉన్న ఖాళీ స్థలంలో మరికొన్ని ఇళ్లు నిర్మించే అవకాశం ఉన్నట్లు నివేదికలో పొందుపర్చారు. పూర్తి వివరాలతో నివేదికను కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు ఎంపీఓ తెలిపారు.

స్థల పరిశీలన

మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ నిర్మాణానికి శనివారం స్థానికులతో కలిసి అధికారులు స్థల పరిశీలన చేశారు. ఎంపీడీఓ కార్యాలయ నూతన భవనానికి రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల వెనక భాగంలోని ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. అంతకు ముందు ఎంపీడీఓ కార్యాలయంలో అఖిల పక్ష నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి విషయాన్ని వివరించారు. అనంతరం అందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు పంపించినట్లు ఎంపీఓ పేర్కొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

'గురుకుల' పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

ములుగు : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సంక్షేమ గురుకుల పాఠశాలల ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఎంపీపీఎస్ మంచినీళ్లపల్లికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి సీట్లు సాధించారు. మల్లంపల్లి మండల పరిధిలోని మంచినీళ్లపల్లి ఎంపీపీఎస్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు సంక్షేమ గురుకుల పాఠశాలలో సీట్లు సాధించడంతో మండల విద్యాధికారి వజ్ఞ తిరుపతి, డీసీఈబీ చైర్మన్ సూర్యనారాయణలు వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచినీళ్లపల్లి పాఠశాల విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధనకు మంచినీళ్లపల్లి పాఠశాల విద్యార్థుల ఫలితాలే నిదర్శనం అని కొనియాడారు. విద్యార్థులు ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దిలీప్, ఉపాధ్యాయుడు ఉమా శంకర్, గ్రామస్తులు కుమారస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ తిరుపతి

పేద విద్యార్థులకు ఉచిత విద్య

- 24న ప్రవేశ పరీక్ష

మంగపేట : గ్రామీణ విద్యార్థులకు పీజీ వరకు ఉచిత విద్యను అందించేందుకు జిల్లా కేంద్రంలో ఈనెల 24వ తేదీన నిర్వహించే ప్రవేశ పరీక్షలకు అర్హులైన వారు పేర్లు నమోదు చేసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ (పీపీటీ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభా వంతులైన విద్యార్థులను గుర్తించి ఉచితంగా విద్యను అందించేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అర్హత పరీక్ష రాసి 5, 6, 7 తరగతులలో ప్రవేశం పొందుతారన్నారు. 80 మార్కులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని, తెలుగు, గణితం, ఆంగ్లము, పరిసరాల విజ్ఞాన శాస్త్రం నుంచి ప్రశ్నలు ఇవ్వబడతాయని తెలిపారు. పరీక్షల్లో అర్హత పొందిన విద్యార్థులకు ప్రవేశం పొందిన తరగతి నుంచి డిగ్రీ ఆపై విద్య వరకు ఉచిత హాస్టల్ ప్రవేశంతో కూడిన విద్యను ఉచితంగా అందిస్తారని వివరించారు. గ్రామీణ నిరుపేదలు, తల్లిదండ్రులు లేని విద్యార్థులు అర్హులని ఈ సదావకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. https://forms.gle/uhxD4DjoyxMUdPM7 వెబ్‌సైట్‌లో గూగుల్ ఫామ్ నింపి పేరును నమోదు చేసుకోవాలని లేదా 93901 49422 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం-3 సబ్ సెంటర్ పరిధిలో భవన నిర్మాణ పనిచేస్తున్న తాపీమేస్త్రీలు, కార్మికులకు శనివారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆశ కార్యకర్త కాళిక అందజేశారు. వేసవికాలం కావడంతో వడదెబ్బ తగిలే అవకాశం ఉండడంతో ముందస్తుగా ఈ ఓఆర్ఎస్ ప్యాకెట్లను తాగాలని ఆమె అవగాహన కల్పించారు.

డీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

గోవిందరావుపేట : డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) గోవిందరావుపేట, తాడ్వాయి మండల శాఖల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిధిలోని పస్రా జెడ్పీఎస్ఎస్‌లో చెరుకుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం డీటీఎఫ్ మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా అధ్యక్షుడు గన్‌రెడ్డి ఆదిరెడ్డి, పరిశీలకులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి రేగా నరేంద్ర కుమార్, ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాప బాబు హాజరయ్యారు.గోవిందరావుపేట మండల అధ్యక్షుడిగా ఎస్.చంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా సమ్మయ్య, వెంకటలక్ష్మి, తేజ, ప్రధాన కార్యదర్శిగా చెరుకుల వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా యాప కన్నయ్య, సరోజిని, సమ్మయ్యను ఎన్నుకున్నారు. అలాగే తాడ్వాయి మండల అధ్యక్షుడిగా టి.లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా సమ్మయ్య, లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా సమ్మయ్య, కార్యదర్శులుగా సాంబయ్య, శ్రావంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

'మా భూమి' సభకు తరలిరావాలి

కాటారం : బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఆదిలాబాద్‌లో డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టనున్న మా భూమి రథయాత్ర ప్రారంభ సభకు తరలిరావాలని డీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిట్యాల శ్రీనివాస్ కోరారు. మండలంలోని కొత్తపల్లిలో శనివారం రథయాత్ర కరపత్రాలను ఆ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ లక్ష కిలోమీటర్ల మేర మా భూమి రథయాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. జిల్లా, నియోజకవర్గంలోని డీఎస్పీ నాయకులు,ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవ ంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొర్రాళ్ల శ్యామ్, బొల్లి సురేశ్, మంథెన రవీందర్, శ్రీకాంత్, తరుణ్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కరపత్రాలు ఆవిష్కరణ

మొగుళ్లపల్లి : మా భూమి రథయాత్ర కరపత్రాలను మండల కేంద్రంలో డీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద రమేష్ శనివారం ఆవిష్కరించారు.

హామీలు అమలు చేస్తున్నాం..

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

ములుగు రూరల్: ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను విడుతల వారీగా అమలు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. మండల పరిధిలో శనివారం జంగాపల్లి, కాశిందేవిపేట, సర్వాపూర్, జగ్గన్నగూడెం, రాయినిగూడెం గ్రామాలలో కలెక్టర్ టీఎస్.దివాకర, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌లతో కలిసి రూ.33 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. అనంతరం సర్వాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. గతంలో ఏజెన్సీ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు మొరపెట్టుకున్నా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. జంగాపల్లిపల్లి నుంచి జగ్గన్నగూడెం వరకు చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. అలాగే బొగ్గువాగుపై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం లోలెవల్ వంతెన నిర్మించిందని అయినప్పటికీ రూ.5 కోట్లతో హైలెవల్ వంతెన నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గ్రామాల్లో మరో వారం రోజుల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, పంచాయతీ రాజ్ ఈఈ అజయ్‌కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలి

అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సమ్మక్క అన్నారు. శనివారం మండలంలోని రాయినిగూడెంలో పోషణ అభియాన్ కార్యక్రమానికి హాజరైన మంత్రికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేకపోతున్నారని వివరించారు. ఇటీవల ప్రమోషన్ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు వేతనం మంజూరు చేయాలని, రిటైర్డ్ వారికి బెనిఫిట్స్ అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని కోరారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి సీతక్క అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవుల విషయం పరిశీలిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పద్మారాణి, సరిత, భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి, వెంకటరమణ, రత్నకుమారి, విజయలక్ష్మితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పోషణా పక్షం కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి సీతక్క అన్నారు. అనంతరం రాయినిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణా పక్షం కార్యక్రమానికి మంత్రి సీతక్క స్త్రీ శిశు సంక్షేమశాఖ సెక్రటరీ అనిత రాంచంద్రం, కలెక్టర్ దివాకర, గ్రంథాలయ చైర్మన్ రవిచందర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు.కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లిస్తాం..

గోవిందరావుపేట: వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని, ఇండ్లు కూలిపోయిన నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి సీతక్క అన్నారు. మండల పరిధిలోని దుంపెల్లిగూడెంలో శనివారం కలెక్టర్ దివాకరతో కలిసి మంత్రి సీతక్క వడగండ్ల వానతో నష్టపోయిన బాధిత కుటుంబాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షంతో చేతికొచ్చిన పంట దెబ్బతినడం బాధాకరమన్నారు. పంటనష్టం, ఇళ్లు కూలిపోయిన వివరాలపై అధికారులు సర్వే చేస్తున్నారని, పూర్తి నివేదిక వచ్చిన తర్వాత బాధితులకు నష్టపరిహారం అందిస్తామని వెల్లడించారు. అనంతరం బాధిత కుటుంబాలకు తక్షణ సాయం కింద వంట సామగ్రితో పాటు రూ.2వేల నుంచి 500వరకు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, ఆర్డీఓ వెంకటేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



వడగండ్ల వాన బాధితులకు నిత్యావసర సరుకులతో పాటు నగదు అందజేస్తున్న మంత్రి సీతక్క

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి

చిట్యాల : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గావ్ చలో–బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో భారత్ అగ్రగామిగా ఉందంటే అది రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ద్వారానే సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గజనాల రవీందర్, చింతల రాజేందర్, కేంసారపు ప్రభాకర్, గుండ మణికుమార్, ర్యాకం శ్రావణ్, కలువచర్ల కిషోర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గావ్ చలో.. బస్తీ చలో

రేగొండ : గావ్ చలో..బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావులపల్లి గ్రామంలో శనివారం బీజేపీ నాయకులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్‌రెడ్డి హాజరై సీతారామాంజనేయస్వామి ఆలయాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. బీజేపీ జిల్లా, మండల నాయకులు దాసరి తిరుపతిరెడ్డి, మోత్కుపల్లి బుచ్చిరెడ్డి, తూర్పాటి మల్లేష్, పెండ్యాల రాజు, కొడగాని రాకేష్, ఎరబాటి శివ తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



రేగొండ: గుడిలో శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

రేషన్ కార్డులు పంపిణీ చేయాలి

భూపాలపల్లి రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో రేషన్ కార్డులు ఇస్తామని అబద్ధపు ప్రచారం చేసి, 12 నెలలుగా రేషన్‌కార్డులు ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తుందని బీజేపీ నాయకుడు దొండల రాజేందర్ అన్నారు. శనివారం భూపాలపల్లి పట్టణంలో గావ్ చలో..బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. రేషన్ కార్డులు లేక ప్రజలు బియ్యంతో పాటు అనేక సంక్షేమ పథకాలు కోల్పోతు బాధపడుతున్నారన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతిదానికి రేషన్ కార్డ్ అవసరం ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కొత్తగా రేషన్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్టు రవి, కొమురయ్య, రాథోడ్ బాబురావు, కుమార్, శ్రీను, మునీందర్, తాండ్ర హరీష్, ఆవుల సంతోష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఢిల్లీకి తరలిన మహిళా కాంగ్రెస్ నాయకులు

మల్హర్ : ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలో జరిగే అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ కొండ రాజమ్మ, వివిధ మండలాలకు చెందిన మహిళా కాంగ్రెస్ నాయకులు శనివారం ఢిల్లీకి తరలివెళ్లారు. రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ఊరూరా నిర్వహించిన గ్రామ సభల్లో ప్రజలను నివృత్తి చేసిన సందర్భంగా ఉత్సవాలకు వెళ్లేందుకు రాజమ్మకు గుర్తింపు దక్కినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.



ఢిల్లీకి వెళ్తున్న రాజమ్మ, కాంగ్రెస్ నాయకులు